సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 16 । మే । 2025



పంటల బీమా పునరుద్ధరణ!

రైతులను ఆదుకునేందుకు పంటలకు బీమాను తిరిగి అమలు చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. 8లో▸



ఫ్లెక్సీ రాజేసిన చిచ్చు

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి కట్టిన ఫ్లెక్సీ అధికార, ప్రతిపక్ష పార్టీల్లో చిచ్చురేపింది. ఇరు వర్గాల నేతలు వాగ్వాదానికి దిగారు. 8లో▸



పచ్చిరొట్ట సాగుతో..

పచ్చిరొట్ట సాగుతో రైతులు భూసారాన్ని పెంచుకోవాలని సీనియర్ శాస్త్రవేత్త మహదేవప్ప సూచించారు. 8లో▸

న్యూస్‌రీల్

సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

షాద్‌నగర్‌రూరల్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో నిర్వహిస్తున్న సరస్వతీ పుష్కరాలకు షాద్‌నగర్ నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు వెళ్తాయని డీఎం ఉష గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీ వరకు బస్సులు నడపనున్నట్లు తెలిపారు. షాద్‌నగర్ నుంచి కాళేశ్వరం వెళ్లేందుకు ఒక్కరికి హైటెక్ బస్సు టికెట్ ధర రూ.880, డీలక్స్ టికెట్ ధర రూ.780 నిర్ణయించినట్టు చెప్పారు. పుష్కరాలకు వెళ్లే భక్తులు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రత్యేక బస్సు సౌకర్యంకోసం 99592 26287 (డీఎం), 91826 45281 (ఏఎంటి) నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రైవేట్‌కు దీటుగా వైద్య సేవలు అందించాలి



షాబాద్ ఆస్పత్రిని సందర్శించిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు


షాబాద్: ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. వివిధ రకాల రుగ్మతలతో ఆస్పత్రికి వచ్చిన ఏ ఒక్కరూ నిరుత్సాహంతో వెనక్కి వెళ్లకుండా తప్పనిసరిగా వైద్యం చేసి పంపించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న తరుణంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రభాకర్‌రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీమయం!

పెరిగిన ఎండలకు తగ్గిన పాల దిగుబడి

- డిమాండ్‌కు, సరఫరాకు మధ్య భారీ వ్యత్యాసం
- అధిక సంపాదన కోసం వ్యాపారుల అడ్డదారులు
- దిగుబడి పెరిగేందుకు గేదెలు, ఆవులకు ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు
- యూరియా, పామాయిల్ కలుపుతూ మార్కెట్లో విక్రయం
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పంట భూములన్నీ రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. కూలీలు, పశువుల మేత, దాణా ఖర్చులు రెట్టింపయ్యాయి. నిర్వహణ భారంగా మారడంతో చాలా మంది రైతులు డెయిరీలకు దూరమయ్యారు. దీనికి తోడు ప్రస్తుతం ఎండలు భగ్గున మండుతుండడంతో పశువులకు పచ్చిమేత కరువైంది. ఫలితంగా పాల దిగుబడి గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం పాల పదార్థాలతో తయారు చేసిన ఐస్‌క్రీంలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. సరఫరాకు డిమాండ్‌కు మధ్య భారీ వ్యత్యాసం నమోదవుతుండడంతో కొంతమంది వ్యాపారులు అధిక సంపాదన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రజారోగ్యాన్ని ఫణంగా పెడుతూ పసిపిల్లలు తాగే పాలను కల్తీ చేస్తున్నారు. కొంత మంది పరిమితికి మించి కుళాయి నీళ్లు కలుపుతుంటే.. మరికొంత మంది ఏకంగా కృత్రిమ పాలను తయారు చేసి గుట్టుగా మార్కెట్‌లోకి తరలిస్తున్నారు.



అవసరం 28 లక్షల లీటర్లు

గ్రేటర్ జిల్లాలకు రోజుకు సగటున 28 లక్షల లీటర్ల పాలు అవసరం. స్థానికంగా ఉన్న డెయిరీలు, రైతులు, డబ్బా వాలాలు, ఇతర వ్యాపారులు ఆరు లక్షల లీటర్లకు కంటే సరఫరా చేయలేని పరిస్థితి. విజయ, మదర్ డెయిరీలు లక్ష లీటర్లకు మించి సరఫరా చేయలేక పోతున్నాయి. దీంతో ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి 20 లక్షల లీటర్ల వరకు దిగుమతి అవుతోంది. వీటిలో 12కిపైగా ప్రముఖ డెయిరీలు సుమారు 18 లక్షల లీటర్ల పాలను విక్రయిస్తున్నాయి. ఒకప్పుడు మెజార్టీ పాలు శివారు జిల్లాల్లోని వ్యక్తిగత డెయిరీల నుంచే సరఫరా అవుతుండేవి. ప్రస్తుతం డెయి రీల సంఖ్య తగ్గడం, ఉత్పత్తి ఆశించిన స్థాయి లో లేకపోవడంతో మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ సరిహద్దు జిల్లాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. మరోవైపు తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలనే ఆశతో కొందరు అధిక పాల దిగుబడి కోసం గేదెలు, ఆవులకు ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు ఇస్తున్నారు. ప్రత్యక్షంగా పశువుల ఆయుఃప్రమాణాన్ని తగ్గించడంతో పాటు పరోక్షంగా పాలు తాగే చిన్నారుల అనారోగ్యానికి కారణమవుతున్నారు.

వెన్నశాతం పెంచేందుకు అడ్డదారులు

సాధారణంగా గేదె, ఆవు పాలల్లో వెన్న ఐదు నుంచి ఏడు శాతం ఉంటుంది. వీటికి ఆయా డెయిరీలు రైతులకు లీటరుకు రూ.35 నుంచి రూ.40 వరకు చెల్లిస్తుంటాయి. డెయిరీలు చెల్లించే ధరలు గిట్టుబాటు కావడం లేదు. దీంతో కొంత మంది స్వయం ఉపాధి కోసం ఉదయం, సాయంత్రం వేళల్లో డబ్బావాలా అవతారం ఎత్తుతున్నారు. డెయిరీలు సరఫరా చేసే ప్యాక్ పాలతో పోలిస్తే వ్యక్తిగత డెయిరీల నిర్వాహకులు సరఫరా చేసే స్వచ్ఛమైన పాలలో వెన్నశాతం అధికంగా ఉండటంతో చాలామంది వీటిని ఇష్టపడుతున్నారు. ప్యాక్ ధరతో పోలిస్తే డబ్బావాలాలు సరఫరా చేసే పాల ధర కొంత ఎక్కువ. ఎదిగే పిల్లలకు స్వచ్ఛమైన పాలను అందించాలనే ఉద్దేశంతో చాలామంది తల్లిదండ్రులు రేటెక్కువైనా వీరిని ఆశ్రయిస్తున్నారు. ప్రజల్లో ఉన్న బలహీనతను కొంతమంది తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. పాలలో వెన్నశాతాన్ని పెంచేందుకు అక్రమ మార్గం ఎంచుకుంటున్నారు. పాలల్లో యూరియా, పామాయిల్ కలుపుతున్నారు. మరికొంత మంది నల్లా నీటిని కలిపి విక్రయిస్తున్నారు. ఈ నీళ్లల్లో అప్పటికే ఈకొలి, కోలిఫాం వంటి ప్రమాదకరమైన బ్యాక్టీరియా దాగి ఉండటం, సరిగా వేడి చేయకుండా నేరుగా ఆ పాలను పట్టిస్తుండటంతో చిన్నారులు అస్వస్థతకు గురవుతున్నారు.

నిపుణుల సూచనల ప్రకారం..

- స్వచ్ఛమైన పాలు 0.55 డిగ్రీల సెంటిగ్రేడ్‌ల వద్ద గడ్డకడతాయి. ఈ ఉష్ణోగ్రత మారిందంటే అందులో నీరు కలిసిందని అర్థం.
- లాక్టోమీటరు పరికరంలో పాలు పోయగానే అందులో కొవ్వు కాకుండా ఇతర ఘనపదార్థాలు (ఎస్ఎన్ఎఫ్) ఎంత శాతం ఉందో ఇట్టే తెలిసిపోతుంది.
- పాలను వేడి చేసినప్పుడు వచ్చే ఆవిరితో ఏర్పడే ఘనపు రేణువులు స్ఫటికాల రూపంలో ఘనీభవిస్తే అందులో యూరియా కల్తీ చేసినట్లు భావించొచ్చు.
- స్వచ్ఛమైన పాలు బండపైపోస్తే అవి ప్రవహించినంత దూరం తెల్లటి ధార కనిపిస్తుంది. అరచేతిని వెనుకవైపు తిప్పి.. మరో చేత్తో కొన్ని చుక్కల పాలను దానిపై పోస్తే నాణ్యమైన పాలైతే సన్నటి ధారలా ప్రవహిస్తుంది. అదే నీళ్లు కలిపినదైతే ధార ఏర్పడకుండా చివర్లో తెల్లటి చుక్క నిలిచిపోతోంది.
- వేడి చేసినప్పుడు పాలపై పసుపు పచ్చగా మీగడ రూపంలో పేరుకుపోవడం, తోడు వేసినప్పుడు టికి పెరుగు కాకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే ఆ పాలలో వనస్పతి ఆయిల్ కలిసినట్లు గుర్తు.
- పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు హైడ్రోజన్ పెరాక్సైడ్ కలుపుతున్నారు. వీటిని కాగబెట్టి తోడు వేస్తే పెరుగుగా మారకపోగా నీళ్ల రూపంలో కనిపిస్తుంది. దీన్ని యూరియాసే స్ట్రిప్స్ ద్వారా నాణ్యతను గుర్తించొచ్చు.
- ప్యాకెట్ పాలల్లో విషపూరిత బ్యాక్టీరియా ఆనవాళ్లు ఉండటంతో వాటిని 100 డిగ్రీల సెల్సియస్ వరకు కాచి వినియోగించాల్సి ఉంది. వీటిని పైపైనే మరగబెట్టి తాగిస్తే వాంతులు, విరేచనాలతో పాటు గ్యాస్ట్రిక్ సమస్యలు తలెత్తే ప్రమాదం లేకపోలేదు.

భవిష్యత్ తరాలకు మెరుగైన విద్యావకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కార్యదర్శి అజిత్ రెడ్డి

మంచాల: భవిష్యత్ తరాలకు మెరుగైన విద్యావకాశాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి కార్యదర్శి అజిత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోనే ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దనున్న ఆరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం సాయంత్రం ఆయన రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్ష సమావేశంలో అజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంచుతామన్నారు. ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యా శాఖ సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వర రావు, చారకోన వెంకటేశ్, జోష్నా రెడ్డి, డీఈఓ సుశీందర్‌రావు, మండల విద్యాధికారి రాందాస్, ఆరుట్ల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అకాలం.. ఆగమాగం

రెండు రోజులుగా జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలు అన్నదాతను నిండా ముంచేశాయి. చేతి కందివచ్చిన పంటలు కళ్లముందే నీటిపాలయ్యాయి. పలుచోట్ల మామిడి కాయలు రాలిపోయాయి. వరి చేలు నేలకొరిగాయి. పూలు, కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. మార్కెట్ యార్డుల్లో విక్రయించేందుకు తెచ్చిన ధాన్యం తడిసిపోయింది. రైతన్నకు తీరని నష్టాన్ని మిగిల్చింది. మరోవైపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఈదురుగాలులతో కూడిన వర్షాలు

- రాలిపోయిన మామిడికాయలు
- నేలకొరిగిన వరి, కూరగాయల పంటలు
- మార్కెట్ యార్డుల్లో తడిసిన ధాన్యం
- అన్నదాతకు అపారమైన నష్టం



షాద్‌నగర్ మార్కెట్‌లో తడిసిన ధాన్యం బస్తాలు

❖ ధాన్యం.. వర్షార్పణం

షాద్‌నగర్: అకాలంగా కురిసిన వర్షం అన్నదాతకు కన్నీటిని మిగిల్చింది. చేతి కొచ్చిన పంటను అమ్ముకునేందుకు మార్కెట్‌కు తీసుకొచ్చిన ధాన్యం వర్షార్పణం అయ్యింది. షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో వివిధ గ్రామాలకు చెందిన రైతులు తాము పండించిన పంటను అమ్ముకునేందుకు తీసుకొచ్చారు. గురువారం ఉదయం ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో ధాన్యం, మొక్కజొన్న పంట పూర్తిగా తడిసిపోయింది. టార్పాలిన్ కవర్లు లేకపోవడంతో పంటను కాపాడుకోలేకపోయారు. కొందరి ధాన్యం మార్కెట్‌లో వర్షానికి పూర్తిగా కొట్టుకుపోయింది.

పడ్డ కష్టం నేలపాలు

అకాలంగా కురిసిన వర్షానికి రైతులు భారీగా నష్టపోయారు. ఇటీవల కురిసిన వర్షాలకు వ్యవసాయ క్షేత్రాల్లోనే పంట నేలపాలైంది. ఉన్నకొద్ది పాటి పంటను అమ్ముకునేందుకు మార్కెట్ వస్తే అకాల వర్షం కోలుకోలేని దెబ్బతీసిందని రైతులు వాపోతున్నారు. వర్షానికి మార్కెట్ యార్డులో వందల సంచుల ధాన్యం తడిసిపోయింది. ఫలితంగా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్ యార్డును పరిశీలించిన అధికారులు

షాద్‌నగర్ మార్కెట్ యార్డును గురువారం మధ్యాహ్నం జిల్లా కోఆపరేటివ్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీఓ సుధాకర్, డీఎస్ఓ వనజాతరెడ్డి తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైతులకు హామీ ఇచ్చారు.

❖ పంట.. కన్నీరే కంట



కేతిరెడ్డిపల్లిలో నేలకొరిగిన వరి

మొయినాబాద్: ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం అన్నదాతలకు తీవ్ర నష్టం మిగిల్చింది. బలమైన గాలులకు పంటలు దెబ్బతిన్నాయి. మొయినాబాద్ మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం, గురువారం ఉదయం ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. చిలుకూరు, అప్పోజీగూడ, చందానగర్, పెద్దమంగళారం, సురంగల్, కనకమామిడి, వెంకటాపూర్, కేతిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మామిడి కాయలు రాలిపోయాయి. కొన్నిచోట్ల వరిచేలు నేలకొరిగాయి. పూలు, కూరగాయ పంటలు సైతం దెబ్బతిన్నాయి.

నేలకూలిన చెట్లు

ఈదురుగాలులకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చెట్లు నేలకూలాయి. విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు తెగిపడ్డాయి. జేబీఐటీ సమీపంలోని అమ్డాపూర్ రోడ్డులో చెట్ల కొమ్మలు విరిగి 11 కేవీ విద్యుత్ లైన్లపై పడడంతో మూడు స్తంభాలు విరిగిపోయాయి. జేబీఐటీ పరిసర ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం నుంచి గురువారం సాయంత్రం వరకు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. మిగతా ప్రభుత్వ కార్యాలయాల్లోనూ పనులు జరగలేదు. ఆయా పనుల నిమిత్తం వచ్చినవారు సాయంత్రం వరకు వేచి చూసి నిరాశతో వెనుదిరిగారు. విరిగిన స్తంభాల పునరుద్ధరణ పనులను అధికారులు గురువారం సాయంత్రానికి పూర్తి చేశారు.

పచ్చిరొట్ట సాగుతో భూసారం పెంపు


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

మొయినాబాద్‌: పచ్చిరొట్ట పైర్ల సాగుతో భూమిలో భూసారాన్ని పెంచుకోవాలని ప్రొఫెసర్‌ జయశంకర్‌ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సీనియర్‌ శాస్త్రవేత్త ఎస్‌.జి మహాదేవప్ప అన్నారు. మొయినాబాద్‌ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరులో గురువారం వరిలో యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి సాగులో రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. పచ్చిరొట్ట పైర్లతోపాటు సేంద్రియ ఎరువులను వాడి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. పంట మార్పిడి విధానం, చిరుధాన్యాల సాగుతో భూమి ఆరోగ్యాన్ని పెండంతోపాటు పర్యావరణ సంరక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త రమేష్‌, సహాయ వ్యవసాయ సంచాలకులు బీజే సురేష్‌, ఏఓ అనురాధ, ఏఈఓ సునీల్‌, రైతులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ రాజేసిన చిచ్చు

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో
కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ నేతల వాగ్వాదం


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి


ఇరు పార్టీల నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

మహేశ్వరం: కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి కట్టిన ఫ్లెక్సీ అధికార, ప్రతిపక్ష పార్టీల్లో చిచ్చు రాజేసింది. ప్రభుత్వ కార్యక్రమాలకు గులాబీ రంగు బ్యానర్‌ను ఎలా వాడతారని కాంగ్రెస్‌ నాయకులు వాగ్వాదానికి దిగారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. గేటు వద్ద ఎమ్మెల్యే సబితారెడ్డికి బీఆర్‌ఎస్‌ నేతలు ఆహ్వానం పలుకుతూ గులాబీ రంగుతో కూడిన బ్యానర్‌ కట్టారు. అధికారిక కార్యక్రమం వద్ద పార్టీ ఫ్లెక్సీ ఎందుకు కట్టారని బీఆర్‌ఎస్‌ నేతలతో కాంగ్రెస్‌ నాయకులు మాటల యుద్ధానికి దిగారు. ఎమ్మెల్యే సబితారెడ్డి కారు దిగగానే కాంగ్రెస్‌ నేతలు నినాదాలతో హోరెత్తించారు. ఈ క్రమంలోనే బీఆర్‌ఎస్‌ ఫ్లెక్సీని చించేశారు. దీంతో ఇరు పార్టీల నేతల మధ్య తోపులాట జరిగింది. వెంటనే మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు ఇరువర్గాలను చెదరగొట్టి నచ్చజెప్పారు. పరస్పరం ఇరు పార్టీల నేతలు ఫిర్యాదు చేసుకున్నారు. అనంతరం 180 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులను ఎమ్మెల్యే సబితారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫ్లెక్సీ విషయంలో రాజకీయాలు చేయడం తగదన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు. తులం బంగారం ప్రభుత్వం ఎప్పుడు ఇస్తుందని చురకలంటించారు. కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సభావత్‌ కృష్ణానాయక్‌, వైస్‌ చైర్మన్‌ చాకలి యాదయ్య, పీఏసీఎస్‌ చైర్మన్‌ మంచె పాండు యాదవ్‌, వైస్‌ చైర్మన్‌ దేవరంపల్లి వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్‌ సైదులు, ఎంపీఓ రవీందర్‌రెడ్డి, ఆర్‌ఐలు స్వర్ణకుమారి, ప్రేమ్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య


మృతదేహం

హయత్‌నగర్‌: రోడ్డు పక్కన చెట్టుకు టవాల్‌తో ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం హయత్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కుంట్లూరు నుంచి గౌరెల్లికి వెళ్లే రహదారిలో నర్సరీ పక్కన వేప చెట్టుకు ఓ వ్యక్తి టవాల్‌తో ఉరేసుకుని మృతి చెందాడు. స్థానికులు గుర్తించి సమాచారాన్ని పోలీసులకు చేరవేశారు. సంఘటనా స్థలానికి వారు చేరుకొని మృతుడి వివరాలపై ఆరా తీశారు. ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయసు సుమారు 45 ఏళ్లు ఉంటాడని, ఎరుపు రంగు టీషర్టు ధరించాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దేవాలయంలో చోరీ

అబ్దుల్లాపూర్‌మెట్‌: ఆలయంలోకి చొరబడి రెండు కిలోల వెండి, 22 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించుకుపోయిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని బలిజగూడలో శ్రీ వీరభద్రస్వామి దేవాలయంలో రోజు మాదిరిగానే ఆలయ అర్చకుడు భూషణ్‌ బుధవారం సాయంత్రం 6.30 గంటలకు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ తలుపులకు తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. గురువారం తెల్లవారు జామున 4గంటలకు గ్రామానికి చెందిన మెరుగు నర్సింహ అనే వ్యక్తి భూషణ్‌కు ఫోన్‌ చేసి గుడి తలుపులు తెరిచి ఉన్నాయని సమాచారం అందించారు. వెంటనే అక్కడికి వెళ్లి చూడగా తలుపులు విరగ్గొట్టి ఉంది. స్థానికుల సహకారంతో పరిశీలించగా ఉత్సవమూర్తులకు అలంకరించిన వెండి, బంగారు ఆభరణాలు కనిపించలేదు. అపహరణకు గురైన వెండి 2 కిలోలు, బంగారం 22 గ్రాముల వరకు ఉంటుందని ఆలయ అర్చకుడు భూషణ్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పంటల బీమా పునరుద్ధరణ!

- వానాకాలం నుంచి అమలు యోచనలో ప్రభుత్వం
- రైతుల్లో చిగురిస్తున్న ఆశలు


మరియాపురంలో పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు

షాబాద్‌: రైతులను అన్నివిధాలా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతోంది. ఆశించిన మేర పంట చేతికొచ్చి మంచి ధర పలికితే రైతులకు ఎంతో మేలు. కానీ కొన్నిసార్లు పండించిన పంట అకాల వర్షాలకు గురై తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. వ్యవసాయం పూర్తిగా ప్రకృతిపై ఆధారపడి ఉండటంతో పంటలకు బీమా తప్పనిసరి అని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు తిరిగి అమలు చేసే యోచనలో ఉంది.

2018 నుంచి నిలిపివేత

పంటల బీమా పథకం రాష్ట్రంలో 2018 నుంచి అమలు కావడం లేదు. దీంతో పంటలు నష్టపోయిన రైతన్నలకు ఎలాంటి పరిహారం అందడం లేదు. బీమాను అమలు చేస్తే ప్రీమియం చల్లించిన అన్నదాతలకు నష్టపరిహారం అందించే అవకాశం ఉంటుంది. మండలంలో ఏటా వానాకాలం, యాసంగిలో సుమారు వేల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తారు. ప్రకృతి వైపరీత్యాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ఫసల్‌ బీమా అమలు చేస్తే రైతులకు ఎంతో మేలు జరిగే అవకాశం ఉంటుంది. గతంలో పంటను బట్టి కొంత ప్రీమియం చెల్లిస్తే మిగతాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించే విధానం ఉండేది. ప్రస్తుతం ఎలాంటి విధివిధానాలు అమలు చేస్తారో వేచి చూడాలి.

గతంలో భారీ నష్టం

గతేడాది సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు మండలంలో నాగర్‌గూడ, తాళ్లపల్లి, తిమ్మారెడ్డిగూడ, ఏట్ల ఎర్రవల్లి, రుద్రారం, హైతాబాద్‌, సోలీపేట్‌ ప్రాంతాల్లో పంటలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. ఆయా గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాల వరకు పంట నష్టం జరిగిందని అధికారులు అంచనా వేసినా అనధికారికంగా ఇంకా ఎక్కువే ఉంటుందని తెలుస్తోంది. నీరందక పంటలు ఎండిపోవడం, అకాల వర్షాలు, తెగుళ్లు సోకి పంటలు దెబ్బ తిన్నా బీమా రక్షణ కవచంలా పని చేస్తుంది. దీంతో రైతులు ఈ పథకాన్ని అమలు చేయాలని పెద్దఎత్తున డిమాండ్‌ చేస్తున్నారు.

బీమా లేక నష్టం



గతేడాది యాసంగిలో ఆరు ఎకరాల్లో మొక్కజొన్న వేశా. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షం కురిసి నష్టపోయా. కనీసం పెట్టుబడి కూడా రాకపోవడంతో రూ.లక్షల్లో నష్టం వచ్చింది. పంటకు బీమా ఉంటే ఊరట పొందేవాణ్ని.
– విజయభాస్కర్‌రెడ్డి, రైతు, మరియాపురం

ఎలాంటి ఆదేశాలు లేవు



పంటల బీమాకు సంబంధించి ఉన్నతాధికారులు, సర్కారు నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు. ప్రభుత్వం వచ్చిన కొత్తలో పంటల బీమా అమలుపై ఆలోచించారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.
– శేఖర్‌, రైతు, తిమ్మారెడ్డిగూడ, షాబాద్‌

ఫేక్‌ ఆధార్‌తో స్థలం కాజేసే కుట్ర

సబ్‌రిజిస్ట్రార్‌ ఫిర్యాదుతో భగ్నం
- పోలీసుల అదుపులో నిందితులు


నిందితులు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు

అబ్దుల్లాపూర్‌మెట్‌: చనిపోయిన వ్యక్తి స్థానంలో వేరొకరిని చూపించి.. నకిలీ ఆధార్‌ కార్డును సృష్టించిన కేటుగాళ్లు ఓ ప్లాటును తమ పేరు మీద రిజిస్ట్రేషన్‌ చేయించుకునేందుకు కుట్ర పన్నారు. ఆధార్‌ కార్డుపై మార్ఫింగ్‌ చేసి రిజిస్ట్రేషన్‌ చేయించుకునేందుకు వచ్చిన ముఠా సభ్యుల తీరుపై అనుమానం వచ్చిన సబ్‌ రిజిస్ట్రార్‌ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అదుపులోకి తీసుకున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకున్న సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని గోషామహల్‌కు చెందిన చంద్రకాంత్‌కు మండల పరిధిలోని మజీద్‌పూర్‌లో ఉన్న 267 గజాల స్థలాన్ని మనకర్‌ ఆనంద్‌ జీపీఏ(866/2013) చేయించుకున్నాడు. కొన్ని నెలలకే ఆనంద్‌ మృతి చెందాడు. ఈ విషయాన్ని గుర్తించి ఆ స్థలాన్ని కాజేయాలని చంపాపేటలో నివాసముండే కొసిరెడ్డి భాస్కర్‌రెడ్డి(సస్పెండ్‌కు గురైన ఆర్టీసీ ఉద్యోగి) పన్నాగం వేశాడు. ఇందులో భాగంగా నల్లగొండ జిల్లా గోనకోల్కు చెందిన బోదాసు ఆంజనేయులును ప్లాట్‌ యజమాని ఆనంద్‌గా చూపించేందుకు నకిలీ ఆధార్‌ కార్డు సృష్టించాడు. అదే సమయంలో వరంగల్‌లోని బలపాలకు చెందిన జిల్లాపల్లి సంజీవరావును చంద్రకాంత్‌గా చూపించేలా మరో ఆధార్‌ కార్డును తయారు చేశాడు. సాక్షులుగా గోనకోల్కు చెందిన దండుగల ఆంజనేయులు, చంపాపేట్‌లో ఉంటున్న కురువ శ్రీనివాసులును తీసుకెళ్లాడు. వీరందరి నుంచి భాస్కర్‌రెడ్డి కొనుగోలు చేస్తున్నట్టు డాక్యుమెంట్‌ రైటర్‌ ఉదయ్‌కుమార్‌తో పత్రాలు సిద్ధం చేసుకున్నాడు. బుధవారం రిజిస్ట్రేషన్‌ చేసుకునే సమయానికి ఆధార్‌ కార్డుల నంబర్లు నమోదు చేసే సమయంలో బయోమెట్రిక్‌లో అసలు, నకిలీ వ్యక్తులకు సరి తూగలేదు. బయోమెట్రిక్‌ సమయంలో ఆనంద్‌ పేరుతో ఉన్న ఆధార్‌ కార్డు నంబరు నమోదు చేయగా ఆంజనేయులు పేరు, చంద్రకాంత్‌ పేరిట ఉన్న ఆధార్‌ కార్డును నమోదు చేయగా సంజీవ పేర్లు రావడంతో సబ్‌రిజిస్ట్రార్‌ సునీతా రాణి అబ్దుల్లాపూర్‌మెట్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌ రెడ్డి తెలిపారు. నిందితులు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మిగతావారు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపడుతున్నట్లు వివరించారు.

ఆత్మహత్య చేసుకుంటున్న వ్యక్తిని కాపాడిన పోలీసులు

మీర్‌పేట: ఆత్మహత్యకు యత్నిస్తున్న వ్యక్తిని మీర్‌పేట పోలీసులు కాపాడి ఆసుపత్రిలో చేర్పించారు. ఎస్‌ఐ రాజశేఖర్‌ కథనం ప్రకారం.. మీర్‌పేట హనుమాన్‌నగర్‌లో నివాసముండే ప్రైవేటు ఉద్యోగి మధుసూదన్‌(45) ప్రైవేటు ఉద్యోగి. గురువారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఆయన ఆత్మహత్య చేసుకునేందుకు ముందుగా పాయిజన్‌ సేవించి బెడ్‌రూములోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకుంటుండగా గమనించిన భార్య మీర్‌పేట పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే సిబ్బంది జంగయ్య, రోహిత్‌, సునీల్‌, రవిలు ఇంటికి చేరుకుని తలుపులు బద్దలు కొట్టి రక్షించారు. అనంతరం ప్రథమ చికిత్స చేసి 108 అంబులెన్స్‌లో అతన్ని ఆసుపత్రికి తరలించారు.

సీజ్‌ చేసిన బోరు బండికి నకిలీ రిజిస్ట్రేషన్‌

పరిగి: పోలీసులు సీజ్‌ చేసిన బోర్‌ బండిని విడిపించేందుకు యజమాని శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నాడు. తప్పుడు పత్రాలతో విదేశాలకు తరలిస్తున్న బోర్‌ బండిని గతేడాది అక్టోబర్‌లో పరిగి పోలీసులకు పట్టుకున్నారు. దీనిని పరిగి ఆర్టీసీ డిపోలో ఉంచారు. బండి యజమాని బోరు బండిని విడిపించేందుకు శతవిధాలుగా ప్రయత్నాలు చేశాడు. అయిన బోరు బండి విడుదల కాకపోవడంతో ఆర్టీసీ సిబ్బందికి ఎర వేసి బండి చేసిస్‌ నంబర్‌ను, ఇంజన్‌ నంబర్‌ మార్చేశాడు. అంతటితో ఊరుకోకుండా మార్చిన నంబర్లతో బోరు బండికి అన్ని పత్రాలు ఉన్నాయని, విడుదల చేయాలని కోర్టును ఆశ్రయించి తప్పుదోవ పట్టించాడు. గుట్టుచప్పుడు కాకుండా బోరు బండికి విడిపించుకుని వెళ్దామని అనుకోవడంతో నంబర్ల ట్యాంపరింగ్‌ బట్ట బయలైంది. ఆర్టీసీ సిబ్బంది కాసులకు కక్కుర్తి పడి చేసిస్‌, ఇంజన్‌ నంబర్లు ట్యాంపరింగ్‌కు సహరించారని ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌ను గురువారం వివరణ కోరగా.. బోరు బండి ఇంజన్‌ నంబర్‌, చేసిస్‌ నంబర్లు మార్చి ట్యాంపరింగ్‌ చేసిన సంగత నిజమే అన్నారు. ట్యాంపరింగ్‌ చేసిన బోరు బండి యజమానిపై, అందుకు సహకరించిన ఆర్టీసీపై కేసు నమోదు చేశామని తెలిపారు.

నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్ట్‌

నాంపల్లి: నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్‌ చేసిన దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు వారి నుంచి 15 నకిలీ సర్టిఫికెట్లు, మూడు మొబైల్‌ ఫోన్లు, రూ. 8 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మాసబ్‌ట్యాంక్‌ ప్రాంతానికి చెందిన షాబాజ్‌ ఖాన్‌, ముర్తుజా నగర్‌కు చెందిన మహ్మద్‌ అబ్దుల్‌ ఇస్మాయిల్‌, శాలివాహన నగర్‌కు చెందిన కడారి రమేష్‌ నకిలీ సర్టిఫికెట్ల దందా నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో దాడి చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రైవేట్‌ బస్సు దగ్ధం

మేడ్చల్‌: జాతీయ రహదారిపై ఓ ప్రైవేటు బస్సు దగ్ధమైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఓ కంపెనీకి ఉద్యోగులను తీసుకెళ్లే బస్సు గురువారం ఉదయం సిద్దిపేట జిల్లా, బస్వాపూర్‌ నుంచి కొంపల్లి వైపు వెళుతోంది. బస్సు పట్టణంలోని రహదారి బంగ్లా సమీపంలోకి చేరుకోగానే ఒక్కసారిగా బస్సులో మంటలు చెలరేగడంతో అప్రమత్తమైన డ్రైవర్‌ బస్సును రోడ్డు పక్కన ఆపి కిందకు దిగాడు. మంటలు వ్యాపించడంతో బస్సు పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాద సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మేడ్చల్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్‌ బిర్యానీలో బల్లి

ఇబ్రహీంపట్నంలో కలకలం రేపిన ఘటన


బిర్యానీలో వచ్చిన బల్లి

ఇబ్రహీంపట్నం: చికెన్‌ బిర్యానీలో బల్లి కనిపించిన సంఘటన ఇబ్రహీంపట్నంలోని ఓ హోటల్‌లో గురువారం చోటుచేసుకుంది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. శేరిగూడ గ్రామానికి చెందిన జి.కృష్ణారెడ్డి ఇబ్రహీంపట్నం ప్రధాన రహదారిపై గల ఏఆర్‌ మైఫిల్‌ ఫ్యామిలీ రెస్టారెంట్‌కు వెళ్లి చికెన్‌ బిర్యానీ భుజిస్తున్నాడు. అందులో బల్లి కనిపించడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. వెంటనే రెస్టారెంట్‌ యజమానిని ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఖంగుతిన్నాడు. 100 డయల్‌ చేసి అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు వైద్య పరీక్షలు చేయించుకున్నాడు. ఇబ్రహీంపట్నం మున్సిపల్‌ అధికారులు రెస్టారెంట్‌ను సందర్శించి విషయాన్ని ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌కు దృష్టికి తీసుకొచ్చారు. ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ అందుబాటులో లేకపోవడంతో శుక్రవారం హోటల్‌ను సందర్శించి తనిఖీ చేస్తానని తెలిపినట్లు మున్సిపల్‌ పర్యావరణ అధికారి ప్రణవ్‌ తెలిపారు. కాగా బిర్యానీలో బల్లి వచ్చిన సంఘటనపై ఫిర్యాదు అందిందని.. ఈ అంశాన్ని మున్సిపల్‌, ఫుడ్‌సేఫ్టీ అధికారులే నిర్ధారించి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఇబ్రహీంపట్నం సీఐ జగదీశ్‌ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి


కళేబరం వద్ద బాధిత రైతు

ఇబ్రహీంపట్నం: కరెంట్‌ తీగలు తగలడంతో ఓ గేదె మృత్యువాత పడిన సంఘటన మండల పరిధిలోని రాయపోల్‌ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. అదే ఊరికి చెందిన నాంపల్లి లాలయ్యకు రెండు గేదెలున్నాయి. అతని వ్యవసాయ క్షేత్రంలో వాటిని మేత కోసం ఉదయం వదిలిపెట్టాడు. సమీపంలోని విద్యుత్‌ స్తంభానికి సపోర్టుగా ఉన్న తీగలు ఓ గేదె కాళ్లకు చుట్టుకున్నాయి. వాటిని విడిపించుకునే క్రమంలో విద్యుత్‌ తీగలకు తగిలి షాక్‌తో మృతి చెందింది. జీవనాధారం కోల్పోయానని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

బిచాణా ఎత్తేసిన ఐటీ కంపెనీ

- ఒక్కో వ్యక్తి నుంచి రూ.2.5 లక్షలు వసూలు
- గచ్చిబౌలి పీఎస్‌లో బాధితుల ఫిర్యాదు

గచ్చిబౌలి: శిక్షణతో పాటు మంచి జీతంతో ఉద్యోగం కల్పిస్తామని నమ్మించి రూ.లక్షలు దండుకున్న ఓ ఐటీ కంపెనీ బిచాణా ఎత్తేసింది. శిక్షణ ఇస్తున్నట్లు నటిస్తూనే బోర్డు తిప్పేయడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని స్కిల్‌ హబ్‌ కన్సల్టెన్సీ నిర్వాహకులు ఉద్యోగాలు కల్పిస్తామంటూ నిరుద్యోగులను నమ్మించారు. గచ్చిబౌలిలోని ప్లాటినా బిల్డింగ్‌లోని 7వ అంతస్తులో ప్యూరోపాల్‌ క్రియేషన్స్‌, ఐటీ సొల్యూషన్స్‌లో శిక్షణతో పాటు ఉద్యోగం ఇస్తామని చెప్పారు. మొదటి విడతలో గత ఫిబ్రవరిలో దాదాపు 70 మంది నుంచి స్కిల్‌ హబ్‌లో డబ్బులు తీసుకొని ప్యూరోపాల్‌కు పంపించారు. సంవత్సరానికి రూ.4 లక్షల ప్యాకేజీ కావాలనుకునే వారి నుంచి రూ.1.8 లక్షలు, రూ.5 లక్షల ప్యాకేజీ కోసం రూ.2.6 లక్షల ప్యాకేజీ కోసం 2.50 లక్షల చొప్పున వసూలు చేశారు. ఆరు నెలల శిక్షణ అనంతరం ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు. ల్యాప్‌టాప్‌ ఇచ్చి వర్క్‌ ఫ్రం హోం ద్వారా శిక్షణ అందించి ఒక నెల జీతం కూడా చెల్లించారు. దీన్ని నమ్మిన చాలా మంది నిరుద్యోగులు స్కిల్‌ హబ్‌ ద్వారా ప్యూరోపాల్‌లో చేరారు. మే 7న ఆఫీస్‌కు తాళం వేసి ఉండటంతో నిరుద్యోగులంతా కంగుతిన్నారు. స్కిల్‌ హబ్‌, ప్యూరోపాల్‌ రెండు ఒకరే నిర్వహిస్తున్నారని బాధితులు తెలిపారు. ప్యూరోపాల్‌ కంపెనీ హెడ్‌ పెరుగు మాధవ రావు, స్కిల్‌ హబ్‌ కోఆర్డినేటర్‌ నిధి, వర్షిణి ద్వారా డబ్బులు సేకరించినట్లు పేర్కొన్నారు. హెచ్‌ఆర్‌ హృతికా రెడ్డి తమను నమ్మించి మోసం చేసిందని ఆరోపించారు. ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్‌ డాక్టర్‌ దిడ్డి సుధాకర్‌తో కలిసి బాధితులు గురువారం గచ్చిబౌలి పోలీస్‌ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు.

‘సన్నాల’ సాగును ప్రోత్సహించండి

- అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు


సమావేశంలో మాట్లాడుతున్న సీఎస్‌ రామకృష్ణారావు

అనంతగిరి: జిల్లాలో సన్నరకం వరి సాగును ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో పౌర సరఫరాల శాఖ కమిషనర్‌ డీఎస్‌ చౌహాన్‌, కలెక్టర్‌ ప్రతీక్‌జైన్‌తో కలసి అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సన్నరకం వడ్లకు ప్రభుత్వం ఇస్తున్న రూ.500 బోనస్‌ గురించి రైతులకు వివరించి సాగు విస్తీర్ణం పెరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రాజీవ యువ వికాసం పథకం ద్వారా యువతకు ఉపాధి కల్పించాలని పేర్కొన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరుపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. రైతు భరోసా, రుణ మాఫీ పథకాలపై ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని.. విద్యార్థుల్లో మానసిక వికాసాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్‌, సుధీర్‌, సబ్‌ కలెక్టర్‌ ఉమాశంకర్‌ ప్రసాద్‌, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌ రెడ్డి, ఆర్‌డీఓ వాసుచంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం వికారాబాద్‌ పట్టణం వెంకటేశ్వర కాలనీలోని 54 నంబర్‌ రేషన్‌ దుకాణాన్ని గురువారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్‌ వివరాలు, కార్డుదారులు బియ్యం తీసుకెళ్తున్నారా తదితర విషయాలను డీలర్‌ను అడిగి తెలుసుకున్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

కొడంగల్‌: పట్టణంలో కొత్తగా చేపట్టిన ఆస్పత్రి భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదేశించారు. గురు వారం నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని సంబంధిత ఇంజనీరింగ్‌ విభాగం అధికారులకు సూచించారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, ప్రసవాల సంఖ్యను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత పట్టణంలోని హరే కృష్ణ సంస్థ ద్వారా పాఠశాలలకు అల్పా హారాన్ని సరఫరా చేసే కిచెన్‌ షెడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కలెక్టర్‌ ప్రతీక్‌జైన్‌, ఎస్పీ నారాయణరెడ్డి, తాండూరు సబ్‌ కలెక్టర్‌ ఉమాశంకర్‌ప్రసాద్‌, కడా ప్రతేకాధికారి వెంకట్‌రెడ్డి, డీసీహెచ్‌ఎస్‌ డాక్టర్‌ ఆనంద్‌, వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌ పద్మ, నర్సింగ్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ లిల్లీమేరి, ఆస్పత్రి సూపరింటెండెంట్‌ చంద్రప్రియ, తహసీల్దార్‌ విజయకుమార్‌, మున్సిపల్‌ కమిషనర్‌ బలరాం నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

పరిగి: రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తూ వారిని ప్రోత్సహిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. గురువారం పరిగి మండలం సుల్తాన్‌పూర్‌లో డీసీఎంఎస్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ధాన్యం విక్రయించేందుకు వచ్చే రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో ఎప్పటికప్పుడు డబ్బులు జమ చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్‌ డీఎస్‌ చౌహాన్‌, కలెక్టర్‌ ప్రతీక్‌జైన్‌, ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్‌ లింగ్యానాయక్‌, తాండూర్‌ సబ్‌ కలెక్టర్‌ ఉమాశంకర్‌ ప్రసాద్‌, డీఎస్‌ఓ మోహన్‌బాబు, జిల్లా మేనేజర్‌ వెంకటేశ్వర్లు, అధికారులు సారంగపాణి, తహసీల్దార్‌ ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.